## క్లుప్తంగా

### స్ఫూర్తి ప్రదాత అయ్యంకి వెంకట రమణయ్య



గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య యువతకు స్ఫూర్తి అని హిందూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీస్ దుర్గా ప్రసాద్ అన్నారు. బుధవారం అయ్యంకి వెంకటరమణయ్య జయంతి సందర్భంగా మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల గ్రంథాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో గ్రంథాలయోద్యమాన్ని నడిపి పుస్తకాల విలువను దేశం మొత్తం చాటి చెప్పిన మహనీయుడు అయ్యంకి వెంకటరమణయ్య పంతులని, ఆయనలోని దీక్షాదక్షతలను ప్రస్తుత యువతరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి గ్రంథపాలకుడు సుబ్బారావు అధ్యక్షత వహించారు. గ్రంథాలయ కమిటీ కన్వీనర్ సీహెచ్ అరుణ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ యల్లాప్రగడ మల్లికార్జునరావు, బోటనీ లెక్చరర్ కృష్ణ, ఐక్యూ ఏసీ డైరెక్టర్ డాక్టర్ పి.వేణుగోపాల్, పోలంరాజు వేంకట రాము, సహాయ గ్రంథ పాలకురాలు శ్రీజ పాల్గొన్నారు.

### విదేశాల్లో ఫార్మసీ విద్యకు విస్తృత అవకాశాలు



గుంటూరు ఎడ్యుకేషన్: విదేశాల్లో ఫార్మసీ విద్యనభ్యసించేందుకు విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయని ఐడీపీ ఎడ్యుకేషన్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ గుంటూరు శాఖ మేనేజర్ వి.వెంకట రమేష్ పేర్కొన్నారు. బుధవారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు ఉన్న అవకాశాలు, అర్హతలపై ఐడీపీ ఎడ్యుకేషన్ సంస్థ సహకారంతో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. వెంకట రమేష్ మాట్లాడుతూ విదేశీ విశ్వ విద్యాలయాల్లో ఫార్మసీలో ఉన్నత విద్యనభ్యసించేందుకు అవసరమైన అర్హతలు, దరఖాస్తు విధానం, కావాల్సిన ధ్రువపత్రాలు, వీసా నిబంధనలను గురించి వివరించారు. విదేశాల్లో చదువుతో పాటు అక్కడి వర్సిటీలు విద్యార్థులకు పార్ట్‌టైం ఉద్యోగాలను అందిస్తాయని చెప్పారు. సదస్సులో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంపీ నాగభూషణం, ఫార్మా.డి డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ ప్రత్యూష, కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ డి.బ్రహ్మ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### క్రీడలతో శారీరక దారుఢ్యం



గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం చేకూరుతాయని సమగ్ర శిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి తెలిపారు. చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జాతీయ నూతన విద్యా విధానం(ఎన్ఈపీ) అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా సమగ్ర శిక్ష విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం శిక్షా సప్తాహ్‌లో భాగంగా బుధవారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తున్నందుకు ప్రధానోపాధ్యాయుడు షేక్ ఎండీ ఖాసింను అభినందించారు. విద్యార్థినులు క్రీడల్లో ప్రావీణ్యాన్ని పెంపొందించుకుని, భావి క్రీడాకారిణులుగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జీసీడీవో సుజాత పాల్గొన్నారు.

### టీజేపీఎస్ కళాశాలకు నాక్ బీ ప్లస్‌ప్లస్ గ్రేడ్



గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలకు నాక్ బీ ప్లస్‌ప్లస్ గ్రేడ్‌కు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం తెలిపారు. బుధవారం కళాశాలలో బోధన, బోధనేతర సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో బ్రహ్మం మాట్లాడారు. ఇటీవల కళాశాలను సందర్శించిన నాక్ బృందం బోధన, మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించిందని చెప్పారు. కళాశాలలో అందిస్తున్న విద్యాబోధన, ప్రగతి అంశాలను పరిశీలించిన మీదట బీ ప్లస్‌ప్లస్ గ్రేడ్‌కు ఎంపిక చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు శ్యాం సుందర్, కోశాధికారి వి.కృష్ణానంద్, పీజీ, డిగ్రీ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్.అనితాదేవి, ఏబీపీ మనోహర్, విభాగాధిపతులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ కె.శాస్త్రి పాల్గొన్నారు.

# నవయుగ కవి చక్రవర్తి జాషువా



జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మేడ్ నాయకులు



జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న భీమ్ భారత్ నాయకులు

నెహ్రూనగర్: నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్ పేర్కొన్నారు. జాషువా వర్ధంతిని రామిరెడ్డితోటలోని సంఘ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవపాల్ మాట్లాడుతూ ఆధునిక కవులలో ప్రముఖ స్థానం సంపాదించుకున్న గుర్రం జాషువా తెలుగు కవిత్వం జాషువాకు ముందు, జాషువాకు తరువాత అనే చెప్పుకోవచ్చన్నారు. జాషువా కళా పీఠం, స్మారక స్థూప కార్యక్రమాలను తిరిగి ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో మేడ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నూరి శామ్యూల్ జోబ్, కొల్లిపర ఆనందరావు, చిలక వెంకటేశ్వర్లు, నంబూరి భాస్కర్‌రావు పాల్గొన్నారు.

**భీమ్ భారత్ ఆధ్వర్యంలో..**

గుర్రం జాషువా వర్ధంతిని పురస్కరించుకుని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ ఆధ్వర్యంలో నగరంపాలెంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బాల్యం నుంచి అంటరానితనాన్ని దగ్గరగా చూసి, అనుభవించి తన విద్యా చైతన్యంతో తెలుగు అక్షరానే ఆయుధంగా చేసుకుని తన కలతో కవిత్వాన్ని అవలీలగా జ్వలించిన అక్షర యోధుడు గుర్రం జాషువా అని కొనియాడారు. కవిత్వ విధానాన్ని తెలుగు ప్రజలకు సహజ సిద్ధమైన వాడుకగా మలిచిన గుర్రం జాషువా నేటి తరం యువతకు ఆదర్శప్రాయుడన్నారు. పల్నాడు జిల్లాకు గుర్రం జాషువా జిల్లాగా నామకరణం చేసి ఆయన గౌరవాన్ని పెంపొందించాలని విజ్ఞప్తి చేశారు.

**స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో..**

ఆధునిక తెలుగు కవులలో స్థానం పొందిన కవి గుర్రం జాషువా సామాజిక ప్రయోజనం ఆశించి రచనలు చేశాడని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీస్ అధ్యక్షులు ఏసుబాబు మాదిగ పేర్కొన్నారు. గుర్రం జాషువా వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు సుబ్బయ్య, మక్కెన ప్రభాకర్, మాచవరపు డేవిడ్, ప్రసాద్, రమణ, అబ్రహాం, రమేష్ పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో కార్పొరేట్‌లకు రెడ్ కార్పెట్

- పేద, మధ్యతరగతిని విస్మరించిన ఆర్థిక మంత్రి
- పోలవరం ప్రాజెక్టుపై కొరవడిన స్పష్టత
- సీపీఐ నాయకుడు జంగాల అజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్, పక్కన నేతలు

లక్ష్మీపురం: కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు పెద్దపీట వేసిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం మరోసారి బడ్జెట్ రూపంలో కార్పొరేట్ వర్గాలకు రెడ్ కార్పెట్ పరుస్తూ... పేద, మధ్యతరగతి వర్గాలకు మొండిచేయి చూపిందని విమర్శించారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు సంతోషపెట్టేలా బడ్జెట్ ఉందన్నారు. పలు రంగాలపై బడ్జెట్‌లో నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. అమరావతి రాజధానికి రూ.15 వేల కోట్లు కేటాయించడం స్వాగతించే విషయమైనా పోలవరం ప్రాజెక్టు అంశంలో స్పష్టత కొరవడిందని తెలిపారు. ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్, కడప ఉక్కు, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ తదితర అంశాలు లేకపోవడం విచారకరమన్నారు. రైతాంగానికి పెట్టుబడి సాయంగా ఇస్తామన్న రూ.20 వేలు తక్షణమే ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆకిటి అరుణ్ కుమార్, షేక్ వలి, బందెల నాసర్ జీ, జిల్లా సమితి సభ్యులు జంగాల చైతన్య పాల్గొన్నారు.

# వివిధ రంగాల ప్రముఖులకు సత్కారం

తెనాలి: పట్టణానికి చెందిన వేజళ్ల వెంకట సుబ్బారావు మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం గాంధీనగర్‌లో వెంకట సుబ్బారావు 10 వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. వేజళ్ల నవ్య రూపొందించిన 'మా స్ఫూర్తి ప్రదాత' బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

విద్య, సాహితీ, కళా, సామాజిక రంగాల్లో సేవలు అందిస్తున్న టి.శివప్రసాద్, ఎం.శ్యామ్‌ప్రసాద్, కె.శివరామకృష్ణ, బెల్లంకొండ వెంకట్, కటకం వెంకట ప్రసాద్, మువ్వా వెంకటేశ్వరరావు, రావి సుబ్బారావును సత్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విశ్రాంత రెవిన్యూ ఉద్యోగి పిచ్చేశ్వరరావు తన ప్రసంగంలో వెంకట సుబ్బారావుతో తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ట్రస్టు వ్యవస్థాపకుడు వేజళ్ల ఉమామహేశ్వర్ మాట్లాడుతూ తన తండ్రి వెంకట సుబ్బారావు పట్టణంలోని కేఎస్ మున్సిపల్ హైస్కూలులో సరస్వతి మందిరం, ఎస్‌సీఆర్ హైస్కూలులో మంచినీటి వసతిని ఏర్పాటు చేయటంతోపాటు ప్రతిభావంతులకు పారితోషికాలు, పేదవిద్యార్థులకు యూనిఫాం అందించినట్టు చెప్పారు. ఆయన పేరిట బీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాలను నిర్మించినట్టు చెబుతూ ప్రస్తుతం ఆ పాఠశాల మున్సిపాలిటీ నిర్వహణలో ఉన్నట్టు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీదేవి, అలపర్తి వెంకటేశ్వరరావు, శివప్రసాద్, భాస్కర్, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

# టీచ్‌టూల్ శిక్షణతో మెరుగైన ఫలితాలు

జిల్లా విద్యాశాఖాధికారి శైలజ



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి శైలజ

తెనాలిఅర్బన్: టీచ్ టూల్ శిక్షణతో ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి శైలజ పేర్కొన్నారు. తెనాలిలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ టీచ్ టూల్ శిక్షణలో నేర్చుకున్న ప్రతి అంశాన్ని పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. అనంతరం కొత్తపేటలోని రావిసాంబయ్య మున్సిపల్ హైస్కూల్‌లో జరుగుతున్న క్రీడ ఉత్సవాలను ఆమె పరిశీలించారు. క్రీడలపై విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దీనిని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట మండల విద్యాధికారులు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతి బాబు, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

# ప్రజాచైతన్యం గ్రంథాలయ సేవానిరతుల కృషిఫలితమే



అయ్యంకి, పాతూరి చిత్రపటాలకు పుష్పాంజలి

తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయ పితామహుడు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య జయంతి, 'కళాప్రపూర్ణ' పాతూరి నాగభూషణం వర్ధంతిని నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి కె.రమాదేవి అయ్యంకి, పాతూరి మహాశయులు గ్రంథాలయ రంగానికి చేసిన చిరస్మరణీయమని చెప్పారు. ఆంధ్ర దేశాన్ని చైతన్యం చేసిన ఉద్యమాల్లో గ్రంథాలయోద్యమం ప్రథమమని గుర్తుచేశారు. వయోజన విద్యా వ్యాప్తికి వారు చేసిన కృషి, కార్యదీక్ష ఫలితంగా రాష్ట్రంలో అనేక గ్రంథాలయాల స్థాపనకు దారితీసిందన్నారు. 'ఆంధ్ర భారతీ తీర్థ' సంపాదకుడు అయ్యంకి వెంకట రమణయ్య తన కృషికి గాను 'గ్రంథాలయోద్ధారక', 'గ్రంథాలయ శాస్త్ర విశారద' బిరుదులు కూడా పొందారని తెలిపారు. పాతూరి నాగభూషణం గ్రంథాలయోద్యమంతోపాటు స్వాతంత్ర్య ఉద్యమంలోనూ పాల్గొన్నారని చెప్పారు. బోటు గ్రంథాలయాలను నడిపిన ఘనత ఆయనదేనని ప్పారు. గ్రంథాలయ శాస్త్రానికి సంబంధించి గ్రంథాలయశాస్త్ర విద్యార్థుల కోసం తెలుగులో గ్రంథాలను రచించారని చెబుతూ, తాను ఆయన శిష్యురాలిని కావటం అదృష్టమన్నారు. ఆయన నుండి క్రమశిక్షణ, సమయపాలన, వృత్తిలో నిబద్ధత, సేవానిరతిని అలవరచుకున్నట్టు చెప్పారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు. తొలుత ఇద్దరి చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు.

# క్రమశిక్షణతో కూడిన విద్యను వీవీఐటీ అందిస్తుంది

చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్



పెదకాకాని: ఆహ్లాదకర సమతుల్యత, క్రమశిక్షణతో కూడిన విద్యను వీవీఐటీ కళాశాల అందిస్తోందని కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. బుధవారం కళాశాలలో డిప్లొమా విద్యను అభ్యసించి వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం పొందిన లేటరల్ ఎంట్రీ విద్యార్థుల తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో విద్యార్థుల భాగస్వామ్యం కీలకమని అన్నారు. నూతనంగా వీవీఐటీలో ప్రవేశించిన విద్యార్థులు మరింత మెరుగ్గా రాణించాలని సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ కళాశాలలోని సీమన్స్ ఎక్స్‌లెన్స్ ల్యాబ్ వంటి మౌలిక వసతులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం ద్వారా విద్యార్థులు ఉపాధి కల్పనకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ ఉదయ్ కుమార్, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, అడ్మిన్ డీన్ డాక్టర్ ఎన్.కుమారస్వామి, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### అంకితభావంతో పనిచేయాలి

ఏఎన్‌యూ: రోజువారీ వేతన ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ఏఎన్‌యూ వీసీ కె.గంగాధర్ కోరారు. విశ్వవిద్యాలయ రోజువారీ వేతన ఉద్యోగుల ఆధ్వర్యంలో బుధవారం యూనివర్సిటీ ఉన్నతాధికారులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. వీసీ ఆచార్య కె.గంగాధర్, రెక్టార్ ఆచార్య రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం హాజరై కేక్ కట్ చేశారు. వీసీ మాట్లాడుతూ వర్సిటీ అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రోజువారీ వేతన ఉద్యోగ సంఘ నాయకులు ఎస్.రమేష్, ఉద్యోగ సంఘ నాయకులు రాధాకృష్ణ, రాంబాబు, నాగేశ్వరరావు, కాంట్రాక్ట్ ఉద్యోగు సంఘ నాయకులు కోడూరు కనకరాజు, విద్యార్థి సంఘ నాయకులు భాగ్యరాజు, జగదీష్ పాల్గొన్నారు.

### సెల్ ఫోన్ దొంగల అరెస్టు

నెహ్రూ నగర్: గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల నుంచి సెల్ ఫోన్లు దొంగలించే ముఠాను ఆర్టీసీ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మేకల వెంకటేష్, పసుపులేటి ఏలియా రాజు ఉదయం బస్టాండ్‌లో ప్రయాణికుల వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు దొంగిలించి తిరిగి సాయంత్రం పూట బస్టాండ్‌లో తిరుగుతున్న ఇద్దరిని ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ బి.మునిరెడ్డి, కానిస్టేబుల్ రాజశేఖర్ అదుపులోకి తీసుకొని బస్ స్టేషన్ ప్రాంగణంలోని అవుట్ పోస్ట్ పోలీసులకు అప్పగించారు.

### సమస్యలు పరిష్కరించాలి

చేబ్రోలు: పాఠశాల విద్యా రంగంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు కోరారు. చేబ్రోలులోని ఎంపీడీవో కె.జ్యోతికి బుధవారం యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ దశలవారి కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు, జీవో 117 రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని యూటీఎఫ్ నాయకులు అందజేశారు. పాఠశాలల విలీనాన్ని రద్దు చేయాలని, సమాంతర మీడియంలను కొనసాగించాలని, హైస్కూల్స్‌లో నాన్ టీచింగ్ స్టాఫ్‌ని నియమించాలని తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రమేష్ బాబు, డి.నాగేశ్వరరావు, ఐ.శ్రీనివాస రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### సాఫ్ట్‌బాల్ జిల్లా జట్టుకు సీఆర్ కళాశాల విద్యార్థులు

నాదెండ్ల: సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా జట్టులో సీఆర్ కళాశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఆగస్టు 10,11,12 తేదీల్లో వినుకొండలో రాష్ట్ర స్థాయి సీనియర్ సాఫ్ట్ బాల్ చాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. వీటిని పురస్కరించుకుని క్రోసూరులోని సెయింట్ ఆన్స్ స్కూలులో జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 170 మంది క్రీడాకారులు హాజరుకాగా, బాలుర విభాగంలో 18 మంది, బాలికల విభాగంలో 18 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. సీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన యు.నరేంద్ర, సాయి, తరుణ్, ప్రేమ్‌కుమార్, సంజన్, సాగర్, హయీంలు ఎంపికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం సీఆర్ కళాశాల ప్రాంగణంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ చుండి వేణుగోపాల్, ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ చైతన్య అభినందించారు.

### కరాటే పోటీల్లో చిన్నారులకు పతకాలు



గుంటూరు వెస్ట్(క్రీడలు): ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో తమ అకాడమీ చిన్నారులు పతకాలు సాధించారని కోచ్ 9వ డాన్ కె.సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న చెన్నైలో నిర్వహించిన పోటీలలో మొత్తం 8 మంది పాల్గొని బంగారు పతకాలు 4, రజతాలు 2, ఒక కాంస్య పతకం సాధించారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆత్మ రక్షణలో చిన్నప్పటి నుంచి శిక్షణనిప్పించాలని సూచించారు.

# బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు కేటాయింపు హర్షణీయం



ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

గుంటూరు మెడికల్: బడ్జెట్ కేటాయింపుల్లో రాజధాని అమరావతికి రూ.15 వేల కోట్లు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ శంకర్ విలాస్ సెంటర్ నుంచి లాడ్జి సెంటర్ వరకు కొనసాగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. ర్యాలీలో టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్ పాల్గొన్నారు. వనమా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఇచ్చిన హామీ బీజేపీ నిలబెట్టుకుందన్నారు. కేంద్ర బడ్జెట్లో ఆంధ్ర రాష్ట్రానికి పెద్ద పీట వేసిందన్నారు. ర్యాలీలో బీజేపీ నాయకులు పాటిబండ్ల రామకృష్ణ, ఈదర శ్రీనివాసరెడ్డి, శనక్కాయల అరుణ, పాలపాటి రవికుమార్, కొక్కెర శ్రీనివాసరావు, జనసేన రాష్ట్ర నాయకురాలు పాకనాటి రమాదేవి, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు చరక కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

# హాయిగా నవ్వుదాం.. నవ్విద్దాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: హాయిగా నవ్వుదాం.. నవ్విద్దాం.. ఆనందంగా జీవిద్దాం.. నవ్వుల ఆటలు ఆడుతూ, జీవన సంగీతపు మధుర రాగాలను ఆస్వాదిస్తూ హాస్య సామ్రాజ్యాన్ని విస్తరింప చేద్దామని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో హాస్యవల్లరి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ హాస్యవల్లరి కో ఆర్డినేటర్ డాక్టర్ వి.వి.రావ్ మాట్లాడుతూ హాస్యం ఒక ఆప్తమిత్రుని వంటిదన్నారు. అది మనల్ని నవ్విస్తుంది, ఆనందపరవశాన్ని చేస్తుందన్నారు. ఒక్క గొప్ప ఔషధంలా పనిచేస్తుందన్నారు. రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ నవ్వు ఆరోగ్యదాయని, ఆనందదాయని అని నవ్వు ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మనం నవ్వుతూ ఇతరులను కూడా మనసారా నవ్వించగలగాలన్నారు. కార్యక్రమంలో విద్యాధరకుమార్, బి.బసవగుప్తా, మల్లేశ్వరరావు, జి.వల్లినాగేశ్వరరావు, రేవతి, ప్రమీల, రాధిక పాల్గొన్నారు.

# ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్ ప్రారంభం

రిజర్వేషన్ మంగళగిరి. .బస్సు విజయవాడలో..



కౌంటర్‌ను ప్రారంభిస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ మంత్రు నాయక్

మంగళగిరి: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆన్‌లైన్ రిజర్వేషన్ కౌంటర్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం నాయక్ మాట్లాడుతూ కరోనా సమయంలో నిలిపివేసిన కౌంటర్‌ను తిరిగి ప్రారంభించినట్లు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు రిజర్వేషన్ కౌంటర్ పనిచేస్తుందని తెలిపారు. హైదరాబాద్, చెన్నై, విశాఖపట్నం, బెంగళూరు నగరాలతో పాటు రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు రిజర్వేషన్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని వివరించారు. ప్రయాణికులంతా రిజర్వేషన్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. అయితే రిజర్వేషన్ కౌంటర్ ఇక్కడ అయినప్పటికీ బస్సు మాత్రం విజయవాడ బస్టాండ్‌లో ఎక్కాలని అధికారులు సూచించడం ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది.

# రేవేంద్రపాడు జెడ్పీ స్కూల్ పరిశీలన



విద్యార్థినులతో కలసి మధ్యాహ్న భోజనం చేస్తున్న డివిజన్ అభివృద్ధి అధికారి పద్మావతి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలంలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తెనాలి డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారి కె.పద్మావతి సందర్శించారు. పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో పరిశుభ్రత విషయంలోను, తాగునీటి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్ఎం డి.సుధామాధురి ఆదేశించారు. 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని అన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందజేస్తున్నారా? భోజనం ఏ విధంగా ఉంది తదితర విషయాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులతో కలసి భోజనం చేశారు. ఆమె దుగ్గిరాల ఎంపీడీఓ బి.భార్గవి, ఎంఈఓ కె.శ్రీనివాసరావు ఉన్నారు.

# ప్రభుత్వాస్పత్రిలో చోరీలకు పాల్పడుతున్న బాలిక

పోలీసులకు అప్పగించిన భద్రతా సిబ్బంది

తెనాలిరూరల్: జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో ఓ బాలిక చోరీలకు పాల్పడుతోంది. బాలికను గుర్తించిన సెక్యూరిటీ సిబ్బంది ఆమెను పట్టుకుని పోలీసులకు బుధవారం అప్పగించారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో గత కొంత కాలంగా చోరీలు జరుగుతున్నాయి. రోగులు, రోగుల సహాయకులకు చెందిన నగదు, నగలు, హ్యాండ్‌బ్యాగులు మాయమవుతున్నాయి. కొద్ది రోజుల క్రితం వైద్యశాలలో రక్త నమూనాలు సేకరించే మహిళ బ్యాగులో ఉన్న నల్లపూసల దండ మాయమైంది. చోరీల విషయం తెలుసుకున్న వైద్యశాల సూపరింటెండెంట్, అధికారులు వైద్యశాలలో ప్రైవేటు ఏజెన్సీ కింద ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న సెక్యూరిటీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రక్తనమూనాలు సేకరించే మహిళ బ్యాగు ఉన్న ప్రదేశానికి సమీపంలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజ్‌ను పరిశీలించగా ఓ బాలిక గొలుసు అపహరించినట్లు గుర్తించారు. వైద్యశాలలో ఉన్న రోగులకు సహాయకురాలిగా వైద్యశాలలో సంచరిస్తూ అందినకాడికి దోచుకుంటోందని సెక్యూరిటీ సిబ్బంది తెలుసుకున్నారు. వైద్యశాల ఓపీ విభాగం వద్ద బుధవారం ఉదయం సదరు బాలిక సంచరిస్తుండగా గమనించిన సెక్యూరిటీ సిబ్బంది ఆమెను పట్టుకుని త్రీ టౌన్ పోలీసులకు అప్పగించారు. ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన బాలిక, కుటుంబసభ్యులు కొంతకాలంగా తెనాలిలో నివసిస్తున్నారని, వైద్యశాలలో చోరీలకు అలవాటు పడిందని పోలీసు వర్గాలు తెలిపాయి. వైద్యశాలలో అపహరించిన నల్లపూసల దండను కడపలో ఓ మహిళ వద్ద ఉంచానని బాలిక పోలీసులకు చెప్పినట్టు తెలిసింది. బాలిక ఒక్కతే చోరీలకు పాల్పడుతోందా? లేక ఆమెతో పాటు మరింత మంది వైద్యశాలకు వచ్చి చోరీలు చేస్తున్నారా అన్న అంశాలను పరిశీలిస్తున్నట్టు పోలీసులు చెప్పారు.

# వరి విత్తనాలు సరఫరా చేయాలి

తెనాలి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు వ్యవసాయశాఖ వరి విత్తనాలను సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లును కోరారు.

వర్షపునీరు నిలిచిన పంట చేల పరిశీలనకు బుధవారం తెనాలి రూరల్ మండలంలో పర్యటించిన జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లును రైతుసంఘం నేతలు, వివిధ గ్రామాల రైతులు కలిశారు. వరి విత్తనాలను 90 శాతం సబ్సిడీతో సరఫరా చేయాలని కోరగా, అయిదు శాతం రాయితీతో కూడిన విత్తనాలను మాత్రమే అందించగలమని వెంకటేశ్వర్లు చెప్పారు. కొద్దిగా సొంతపొలం ఉండి కౌలుకు చేసుకుంటున్న రైతుల వివరాలను సేకరించాలనీ, జేఎల్‌జీ గ్రూపులు ఏర్పాటుచేయాలని, ప్రతి వ్యవసాయశాఖ, ఆర్‌బీకే ఉద్యోగులు కనీసం 10 గ్రూపులు ఏర్పాటుచేసి, బ్యాంకర్ల నుండి రుణాలను ఇప్పించాలని కోరారు. వీరితో రైతులు వేజెండ్ల రోశయ్య, మహబూబ్‌ఖాన్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.